క్లుప్తంగా

సబ్‌జైల్లో కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం?

పెనుకొండ: పట్టణంలోని సబ్‌జైల్లో మంగళవారం ఈశ్వర్ అనే కానిస్టేబుల్ ఆత్మహత్యకు యత్నించినట్లు తెలిసింది. సబ్‌జైలు లోపల ఈశ్వర్ ఫినాయిల్ తాగుతుండగా అక్కడున్న సిబ్బంది అడ్డుకొన్నట్లు సమాచారం. వెంటనే అతన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు ఎలాంటి ప్రమాదం లేదని పేర్కొన్నట్లు తెలిసింది. ఈ విషయమై 'సాక్షి' సబ్‌జైలు సూపరింటెండెంట్ వివరణ కోరడానికి ఫోన్ ద్వారా ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు. స్థానిక ఎస్ఐ రమేష్‌బాబును సంప్రదించగా తనకు తెలియదని సమాధానం ఇచ్చారు. సబ్‌జైల్ సిబ్బందిని వాకబు చేయగా వారు మాట్లాడడానికి నిరాకరించారు.

అభివృద్ధి పనులతోనే సమాధానం

పావగడ: తాలూకా వ్యాప్తంగా తాను చేపట్టిన అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక తనపై ఆరోపణలు చేసిన వారికి తాను చేసిన అభివృద్ధి పనులే సమాధానం చెబుతాయని ఎమ్మెల్యే వెంకటరమణప్ప అన్నారు. తాలూకాలోని తాళెమరదహళ్లిలో మంగళవారం నిర్వహించిన రోడ్డు పనుల భూమి పూజలో ఆయన మాట్లాడారు. తాళెమరదహళ్లి గేట్ నుంచి గంగసాగర వరకు రూ.4 కోట్ల వ్యయంతో తారు రోడ్డు పనులు త్వరలో ప్రారంభిస్తున్నట్లు చెప్పారు.

'పది' పరీక్షలకు 18 కేంద్రాల ఏర్పాటు

మడకశిర: నియోజకవర్గంలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు 18 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అగళి ఎంఈఓ, రూట్ ఆఫీసర్ గోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. మడకశిరలో 7, అమరాపురంలో 4, గుడిబండలో 3, రొళ్లలో 2,.అగళిలో 2 చొప్పున పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఏప్రిల్ 3 నుంచి టెన్త్ పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. టెన్త్ ప్రశ్న పత్రాలు ఆయా మండలాల పోలీస్‌స్టేషన్లలో భద్రపరిచినట్లు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శులపై డీపీఓ ఆగ్రహం

రొద్దం: విధి నిర్వహణలో పంచాయతీ కార్యదర్శులు అలసత్వం చూపుతున్నారని డీపీఓ విజయకుమర్ మండిపడ్డారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రామ సచివాలయాలను డీపీఓ తనిఖీ చేశారు. పన్నుల వసూలులో కార్యదర్శులు సక్రమంగా పనిచేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. సచివాలయంలో పలు రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ కేశవరెడ్డి ఉన్నారు.

కార్మికులకు ప్లాస్కుల పంపిణీ

హిందూపురం: 24వ వార్డు సచివాలయంలో కార్మికులకు కౌన్సిలర్ నాగేంద్రబాబు ప్లాస్కులు అందజేశారు. పని ఉన్న చోటుకు ఉదయాన్నే టీ, కాఫీ తీసుకెళ్లేందుకు వీలుగా కార్మికులకు ప్లాస్కులు అందించినట్లు నాగేంద్రబాబు తెలిపారు.

ఉగాది సందడి

హిందూపురం/పెనుకొండరూరల్/మడకశిర రూరల్: తెలుగు వారి తొలి పండుగ ఉగాది. పచ్చతోరణాలతో శోభకృత్ సంవత్సరానికి సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలకడానికి ప్రజలు మామిడి, వేప, బిళపత్రి తదితర ఆకుల పచ్చతోరణాలతో ప్రజలు తమ ముంగిళ్లను అందంగా అలంకరించారు. బుధవారం ఉగాది పండుగ సందర్భంగా హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లో క్రయ విక్రయాలతో సందడి నెలకొంది. మంగళవారం ఆయా ప్రాంతాల్లోని మార్కెట్లు, మెయిన్ బజార్లు కిటకిటలాడాయి. ఇంటి తోరణాల కోసం పూలు, పండ్లు, టెంకాయలు, పూజలకు అవసరమైన వస్తువుల విక్రయాలు జోరుగా సాగాయి.


పెనుకొండ: పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు


పెనుకొండ: మామిడి ఆకులు, వేప పూత..


షాపులో బట్టలు కొనుగోలు చేస్తున్న ప్రజలు


మడకశిర మార్కెట్‌లో పూల కొనుగోళ్లు


హిందూపురంలో పండ్ల విక్రయాలు

ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు


ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే తిప్పేస్వామి ఒక ప్రకటనలో ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. తెలుగు నూతన సంవత్సరంలో నియోజకవర్గ ప్రజలకు అన్ని విధాలుగా మంచి జరగాలని దేవుడిని వేడుకుంటున్నట్లు పేర్కొన్నారు.

ఏడుగురు విద్యార్థుల గైర్హాజరు

మడకశిర (అగళి): అగళిలో మంగళవారం జరిగిన ద్వితీయ సంవత్సరం ఇంటర్ పరీక్షలకు ఏడుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని మోడల్ కళాశాల ప్రిన్సిపాల్ చక్రధారి తెలిపారు. మొత్తం 193 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 186 మంది హాజరైనట్లు పేర్కొన్నారు.

ఇద్దరికి తీవ్రగాయాలు

చిలమత్తూరు: మండలంలోని కోడూరు మర్రోతోపు – గోరంట్ల ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికుల వివరాల మేరకు ముద్దప్పపల్లికి చెందిన నరసింహారెడ్డి అనే దివ్యాంగుడు రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళుతుండగా బైక్‌పై వచ్చిన గంగయ్య అనే వ్యక్తి బలంగా ఢీకొన్నారు. ఈ ఘటనలో నరసింహారెడ్డికి మరో కాలు కూడా పూర్తిగా విరిగిపోగా, గంగయ్య ముళ్ల పొదల్లో పడిపోయాడన్నారు. క్షతగాత్రులను 108 ద్వారా హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

- ఎమ్మెల్యే శంకరనారాయణ


రొద్దం: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

రొద్దం: మండల వ్యాప్తంగా ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాని ఎమ్మెల్యే శంకరనారాయణ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని రొద్దకాంబ మండల సమాఖ్య కార్యాలయంలో ఎంపీపీ చంద్రశేఖర్ అధ్యక్షతన ఇళ్ల నిర్మాణంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ని ఇళ్లు మంజూరయ్యాయి? ప్రస్తుతం వాటి పరిస్థితి ఏంటి? తదితర వివరాలను హౌసింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనుకున్న లక్ష్యానికి చేరుకోవాలంటే అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే శంకరనారాయణ సూచించారు.

ఇబ్బంది పెడితే చర్యలు తప్పవు

గోరంట్ల: 'పేదలందరికీ ఇళ్లు' పథకం కింద ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపు, ఇతర అంశాలలో సచివాలయ ఇంజనీర్లు , హౌసింగ్ సిబ్బంది ఇబ్బందులు కలిగిస్తే మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ హెచ్చారించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఇళ్ల నిర్మాణాల పురోగతిపై ఎమ్మెల్యే రెవిన్యూ, హౌసింగ్, సచివాలయ ఇంజనీర్లు, గ్రామ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల వ్యాప్తంగా ప్రభుత్వం భూసేకరణ చేసి ఆరు లే అవుట్లను ఏర్పాటు చేసి 1200 లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేసిందని, అలాగే మరో 1717 మంది సొంత స్థలం కలిగిన వారికి ఇళ్లు మంజూరు చేసినట్లు హౌసింగ్ డీఈ నాగరాజు పేర్కొన్నారు. వివిధ స్థాయిలో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. లబ్ధిదారులను గుర్తించడంతో పాటు ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు బిల్లులు చెల్లించడంలో సచివాలయ ఇంజనీర్లు అలసత్వం వహిస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే గృహ నిర్మాణానికి సంబంధించి ఏ విషయంలోనైనా సరే లబ్ధిదారులను ఇబ్బందిపెడితే మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలని, వివక్ష చూపితే మాత్రం చర్యలు తప్పవన్నారు.

25న ఆపరేటర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

హిందూపురం టౌన్: స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రిలో ఆరోగ్యశ్రీ పరిధిలో నాలుగు డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు ఈ నెల 25న వాకిన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ రోహిల్ కుమార్ తెలిపారు. డిగ్రీ పూర్తి చేసి పీజీడీసీఏ చేసిన వారు అర్హులని, ఇంటర్వ్యూలో ఎంపికైన వారికి రూ.7 వేల నుంచి రూ.9 వేల జీతం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు 25 ఉదయం 10.30 గంటలకు ఆస్పత్రిలోని సూపరింటెండెంట్ కార్యాలయంలో ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు.

సజావుగా వేలం పాట

హిందూపురం: పట్టణంలో వివిధ మార్కెట్‌లలో గుత్తాలు వసూలు చేసుకునే హక్కు కోసం మంగళవారం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వేలం పాటలు జరిగాయి. దిన మార్కెట్‌లో రోడ్డు మార్జిన్లపై అమ్ముకునే వస్తువులకు గుత్త వసూలు హక్కుకు మున్సిపాల్టీ రూ. 41,23,000 నిర్ణయించగా అస్మాభాను అధికంగా రూ.41,49,999 వేలం పాడి 2023–24కు హక్కును పొందారు. అలాగే చిన్నపశువుల తోళ్ల మార్కెట్‌కు రూ.6,22,000 నిర్ణయించగా అధికంగా రూ.6,36,000 మహేజబీన్ దక్కించుకున్నారు. పెద్ద పశువుల తోళ్ల మార్కెట్ రూ.1,12,000 నిర్ణయించగా రూ.1,13,000 షరీన్ హక్కు పొందినట్లు అధికారులు తెలిపారు. అలాగే పరిగి బస్టాండ్ ఆవరణంలో ఖాళీ జాగా అద్దెకు మున్సిపాల్టీ రూ.15,43,000 నిర్ణయించగా అన్వర్‌ఖాన్ రూ.16,29,000కు దక్కించుకున్నట్లు తెలియజేశారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

అమరాపురం: మండలంలోని మోడల్ పాఠశాలలో మంగళవారం మధ్యాహ్న భోజనాన్ని ఎంఈఓ సత్యనారాయణ, ఎంపీపీ ఈరన్న ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. నాణ్యమైన భోజనాన్ని మెనూ ప్రకారం వడ్డించాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

పెనుకొండ: పట్టణ సమీపంలోని ఆర్టీఓ చెక్‌పోస్ట్ వద్ద మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో చలివెందులకు చెందిన బేల్దారి శివకు తీవ్ర గాయాలు అయ్యాయి. హిందూపురం వైపు నుంచి పెనుకొండకు వస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు బాధితుడిని పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

స్టడీ సర్కిళ్లు ఏర్పాటు చేయాలి


శాసన మండలిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

హిందూపురం: మైనార్టీ ముస్లిం విద్యార్థుల విద్యాభ్యున్నతి, ప్రభుత్వ ఉద్యోగాల సాధన కోసం ముస్లిం స్టడీ సర్కిళ్లను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ కోరారు. మంగళవారం విజయవాడలో జరిగిన శాసన మండలి సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ సచార్ కమిటీ, ఇతర కమిటీ నివేదికల ప్రకారం ముస్లిం మైనార్టీలు అన్నిరంగాల్లో ముఖ్యంగా విద్య, ఉపాధి రంగాల్లో ఉద్యోగ సెక్టార్స్‌లో వెనుకబడి ఉన్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం జగన్ ముస్లిం మైనార్టీలకు విద్య, వైద్యం ఆరోగ్యంతో పాటు విద్య, రాజకీయంగా అవకాశాలు కల్పిస్తున్నారని చెప్పారు. ముఖ్యంగా విద్యాభివృద్ధి ప్రభుత్వం ఎంతగానో ఊతమందిస్తోందన్నారు. అయితే బీసీ, ఎస్సీ, ఎస్టీ స్టడీ సర్కిల్స్ మాదిరిగా ముస్లిం మైనార్టీ స్టడీ సర్కిళ్లు ఏర్పాటు చేస్తే మైనార్టీలు గ్రూప్–1 నుంచి పోలీసు కానిస్టేబుల్ వరకు ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు పొందటానికి ఉపయోగం పడుతుందన్నారు.

ఆధార్ సెంటర్ పరిశీలన

అమరాపురం: మండలంలోని గ్రామ సచివాలయాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలను మంగళవారం తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీడీఓ మునిస్వామి పరిశీలించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు, సలహాలిచ్చారు.

జగ్జీవన్‌రామ్ విగ్రహం ఏర్పాటు చేయాలి


ఐక్యత చాటుతున్న నాయకులు

మడకశిర: విజయవాడలో ఏర్పాటు చేస్తున్న అంబేడ్కర్ విగ్రహం పక్కనే బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయాలని వివిధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం దళిత హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మడకశిరలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. సమావేశానికి డీహెచ్‌పీఎస్ అధ్యక్షుడు హనుమంతు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు ఉమర్‌ఫారుఖ్‌ఖాన్, జీవిక సంస్థ అధ్యక్షుడు యోగానంద్, జననీ ఫౌండేషన్ అధ్యక్షుడు నౌషాద్, స్థానిక నాయకులు నరసింహ, హనుమంత రాయప్ప,రామాంజినేయులు, ఆదిశేషు, నరసింహప్ప, మారుతి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి


రొళ్ల సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ శివారెడ్డి

మడకశిరరూరల్: మండలంలోని గ్రామ పంచాయతీల్లో ఆదాయ వనరులను పెంపొందించుకొని గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని డీఎల్‌డీఓ శివారెడ్డి ఉద్యోగులకు సూచించారు. మంగళవారం ఆయన జీవీపాళ్యం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు.

రొళ్ల: సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఈ–సర్వీసెస్ ద్వారా పూర్తిస్థాయిలో సేవలు అందించడానికి కృషి చేయాలని పెనుకొండ డీఎల్‌డీఓ శివారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని రొళ్ల, రత్నగిరి, కాకి సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలిచ్చారు.

బ్యాంకులో రికార్డుల పరిశీలన


ఏడీసీసీబీ చైర్‌పర్సన్ లిఖితను సన్మానిస్తున్న దృశ్యం

గోరంట్ల: స్థానిక సహకార బ్యాంక్‌ను మంగళవారం ఏడీసీసీబీ చైర్‌పర్సన్ లిఖిత సందర్శించారు. ఈ సందర్భంగా వ్యవసాయ రుణాలు, బంగారు రుణాలకు సంబంధించిన వివరాలను బ్యాంకు మేనేజర్ చంద్రశేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. సహకార బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి, బ్యాంకు సిబ్బంది లిఖితను ఘనంగా సన్మానించారు.

పోషణ్ పక్వాడాపై అవగాహన

లేపాక్షి: లేపాక్షిలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం ఉదయం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పోషణ్ పక్వాడాపై ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ రెడ్డిరమణమ్మ ఆధ్వర్యంలో బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ ఈనెల 25 నుంచి ఏప్రిల్ 3 వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. బాలికలు చిరుధాన్యాలు, ఆకుకూరలు, పసుపు పచ్చని పండ్లు తినాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయమ్మ, విద్యాలయం ఎస్ఓ నీలిమా, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో జేడీఎస్ నాయకుడి మృతి

పావగడ: స్థానిక జేడీఎస్ పార్టీ సీనియర్ నేత, వాల్మీకి సంఘం నాయకుడు రాజప్ప (65) రోడ్డు ప్రమాదంలో మంగళవారం తెల్లవారు జామున మృతి చెందారు. నాగలమడక హోబళి తిమ్మమ్మనహళ్లికి చెందిన రాజప్ప ఉగాది పండుగ కోసం పూలు తీసుకుని ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి వెళ్తుండగా పట్టణ సమీపంలోని చళ్లకెర క్రాస్ వద్ద ఉన్న ఓ డాబా గోడకు ఢీకొని కిందకు పడిపోయారు. ప్రభుత్వాసుపత్రి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ అజయ్ సారథి తెలిపారు.

జూదరుల అరెస్ట్

పెనుకొండ రూరల్: మండలంలోని హనుమప్పల్లి గ్రామ సమీపంలో జూదం ఆడుతున్న 13 మందిని మంగళవారం సాయంత్రం అరెస్టు చేసినట్లు పెనుకొండ పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.18,300 నగదుతో పాటు పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నామన్నారు. పక్కా సమాచారం రావడంతోనే హనుమప్పలి సమీపంలో జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.

ప్రభుత్వ బడుల్లో 'రాగిజావ'


మడకశిర: విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి


హిందూపురం: రాగిజావ అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ


పరిగి: ఊటుకూరులో రాగి జావా తాగి సంతోషాన్ని వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

సాక్షిబృందం: ప్రభుత్వ బడుల్లో ప్రభుత్వం మంగళవారం నుంచి రాగిజావ పంపిణీని ప్రారంభించింది. ఇందులో భాగంగానే హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో అన్ని ప్రభుత్వ పాఠశాల్లో మంగళవారం ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు రాగిజావ అందించారు. మడకశిరలోని జెడ్పీ బాలికోన్నత, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే తిప్పేస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని విధాలా అండగా ఉండటమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యం... ఇందులో భాగంగానే పూర్తిస్థాయిలో పౌష్టికాహారం అందించేందుకే ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేస్తున్నామన్నారు.